

# ఒక్కరోజు స్వాతంత్ర్యం!

నిప్పాణి లక్ష్మీగిరిధర్

'ఏవండీ! నాకు స్త్రీ స్వాతంత్రం లేదు, ఒక్క రోజు కావాలి.'

"అయితే రేపిచ్చాను పడుకో" అన్నారు శ్రీవారు పక్కమీంచి అటు దొర్లి.

ఆలోచిస్తూ పడుకున్నాను. సంవత్సరాలబట్టీ పత్రికల్లో చదివీ, చదివీ ఈ ఐడియా పంటబట్టింది నాకు. నా స్త్రీ స్వాతంత్రం దెబ్బ తిన్నట్లే అనిపించింది. పైగా ఈ వనితాలోకాల్లో వ్యాసాలు చదివాక నా స్వాతంత్ర్యం ఎంత జారిపోయిందో నేనెంత అధఃపాతాళానికి దిగిపోతున్నానో తెలిసిపోయింది. ఇహ ఇది సాగనీయకూడదు. స్త్రీ వంటింటి కుందేలు కాదు. ఐ మీన్ వంటింటి మిషనుకాదు. మొగవాడి ఆటబొమ్మ అసలే కాదు. ఈ ఒక్క రోజు స్వాతంత్రంలోనన్నా నా తఢాకా చూపించి స్త్రీ అంటే ఏవిటో తెలియజెప్పాలి. ఆదిశక్తి, అపరకాళి హూ! అనుకుంటూ కళ్ళు మూసుకున్నా.

ప్రొద్దున్నే అలవాటు ప్రకారం లేచి 'సుప్రభాతం' రేడియోగ్రాంలో ఆన్చేసి వంటింట్లోకి నడిచాను ఆలోచిస్తూ. ఈ ఒక్క రోజు నా స్త్రీ స్వాతంత్రాన్ని ఎలా గడపాలా? అని ఆలోచిస్తూ కాఫీ గిన్నె దించాను స్టౌ మీదనించి. అంతలోకే గుర్తొచ్చాయి 'స్త్రీ స్వాతంత్ర్యం – వనితాలోకాలు సమాన హక్కులు' కళ్ళముందన్నీ గిర్రున తిరిగాయి. నిద్ర లేచిందగ్గర్నించి ఆడదానికి వంటిల్లేనా గతి? ఛీ! కాఫీ ఇవ్వకూడదు. ఆయన్నే కాచుకు తాగనీ ఏం బిడాయి లేకపోతే! అలాగే నాకు ఓ కప్పు కాఫీ ఇమ్మంటాను అనుకుంటూ బెడ్రూములో కెళ్ళాను. ఆయనగారు పక్కమీద అటూ ఇటూ పొర్లుతున్నారు. సుప్రభాతం సగం అయింది. ఇంకా కాఫీ రాలేదనిగామోసు ఆ నీలుగుడు నాన్సెన్స్! నేనెందుకిస్తాను కాఫీ అందులోను నాకీ రోజే స్త్రీ స్వాతంత్రమెచ్చిందాయె నాతోపాటూ తనూ ఆరుగంటలకే లేచి కాఫీ తీసుకు తాగాలి. ఆ! మరి ఎవరి పని వారు చేసుకోవాలనేగా పుస్తకాల్లో చదివింది. శ్రీ బానిసగాడు అన్నీ తెచ్చి నోటి దగ్గరందించడానికి డామిట్!

అంతలోకే గుర్తొచ్చింది కాఫీ చల్లారిపోయిందని వెచ్చపెట్టుకుని ఓ కప్పుడు పోసుకుని తాగుదామని నోటిదాకా వచ్చింది కూడా–మనసు చివుక్కుమన్నది. బెడ్‌కాఫీ వాసన ముక్కుకు తగుల్తేగాని ఆయన కళ్ళు తెరవరు. లేకపోతే స్టమక్ ఆ రోజు ఆర్డరులో వుండదు. టైంటేబిలంతా మారిపోతుంది. పోనీలే పాపం నిద్ర మొహంతోనే ఆయన్ని బాధపెట్టడమెందుకూ! పైగా ఆయనకూ నిద్రమత్తులో తనకీ రోజు స్త్రీ స్వాతంత్రమిచ్చినట్లు గుర్తుండకపోవచ్చు.

"గుడ్మార్నింగ్" చెప్పి బెడ్‌కాఫీ అందించాను.

"ఏం! ఈ రోజింతాలస్యమైందీ–వెరీ గుడ్మార్నింగ్ – కాఫీ కప్పిలాతే!" అంటూ త్రాగడం మొదలుపెట్టారు. ఎంత నిర్లక్ష్యం అప్పుడే నా స్త్రీ స్వాతంత్రం దెబ్బ తింది. ఆవళంగా తాగుతున్న కాఫీకప్పు లాక్కుపోదామనిపించింది. డామిట్ ఈనకి స్త్రీని గౌరవించడం అస్సలు తెలీదు. ఎప్పుడన్నా పత్రికల్లో వనితా వ్యాసాలూ ప్రమదావనాలు గట్రా చదివేడిస్తేగదా!

"సార్! ఆడది వంటింటి మిషిన్ కాదు. కంప్యూటరు అంతకంటే కాదు. స్త్రీ స్వాతంత్ర్యం! సమాన హక్కులు – పైగా ఈ రోజు నా ఇండిపెండెన్సుడే కాబట్టి కాఫీ కప్పు కడిగి క్రోకరీలో పెట్టెయ్యండి బుద్ధిగా" అన్నాను వుడుక్కుంటూ.

"ఓ! ఐయామ్ సారీ! దిసీజ్ యువర్ డే (!) కదూ! అలానేకానీ" అంటూ కాఫీ కప్పు టీపాయ్ మీద పడేసి బాత్‌రూములోకి పరిగెట్టారు. నేనో పక్కన మొత్తుకుంటున్నా, కాఫీ కప్పు అక్కడే పడేసిపోతుంటే నా అహం దెబ్బ తింది. స్త్రీ స్వాతంత్రానికి తీరని అవమానంగా తోచింది. మనిషికింత నిర్లక్షమేమిటి?

ఇంతలోకే రెండు చీమలు కాఫీకప్పు మీద కెక్కుతున్నాయి. దీన్నిలాగే వదిలేస్తే బోల్డు చీమలు పడతాయి. అవి పక్కమీద కెక్కుతాయి. పైగా రాత్రంతా కుడతాయి. సరే లెమ్మని నా స్త్రీ స్వాతంత్రాన్ని కాస్త రిలాక్సు చేసి కప్పు, సాసరూ సింక్‌లో పడేసి పెరట్లో కెళ్ళి చూస్తినిగదా – ఫన్నీసీన్...నైట్ గౌనులో శ్రీవారు నోట్లో సిగరెట్ పెట్టుకుని పొగ కంట్లోకి పోయి నీళ్ళొస్తుంటే, అంట్లగిన్నెల మధ్య నిమ్మచెట్టుక్రింద కూర్చొని, చింతపండేసి చారుగిన్నె తోముతున్నారు. గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయాను. అప్పుడే వచ్చిన పనిపిల్ల రాధ ఈ చోద్యం చూచి నోరింత చేసుకుని "అమ్మాడియో!! ఇదెన్నా అమక్కళం తాయే! అయ్యా నిండా మంచివాడుదా అని అంట్లు తోమిస్తావా అమ్మా??" అన్నది అరవ తెలుగులో.

నేను పెద్ద రిస్కులో పడిపోయాను. "ఇదేం ఖర్మండీ – పొద్దున్నే లేవండీ" అంటూ కాలర్ పట్టుకుని లాగాను.



"కొంచెం విమ్ పట్టుకురా డియర్! చింతపండుకు చారుగిన్నె పాలిష్ రావడంలేదు" అంటున్నారాయన.

చీర కుచ్చిళ్ళు పైకి దోపుకుని పరిగెత్తాను చెంబుతో నీళ్ళు తేవడానికి. చేతిమీద నీళ్ళు పోస్తూ "అది కాదండీ! స్త్రీ స్వాతంత్రం అడిగానుగాని,

మిమ్మల్ని అంట్లు తోమమన్నానా? ఇహ లేవండి!" అన్నా.

సిగరెట్ పొగ ముక్కులోకి దూరగా ఒకే తుమ్ము తుమ్మి పడిపోయిన సిగరెట్ వంక చూస్తూ తడిచేతులు నా చీర కొంగుకు తుడుచుకుంటూ "తప్పేముంది డార్లిన్! నువ్వు కాఫీ కాచావు, నేనంట్లు తోమాను. నువ్వు వంట వొండుతావు, నేను కంచాలేసి వడ్డిస్తాను. నువ్విల్లు కడుగుతావు, నేను రాత్రి పక్కలూ అవీ వేసి పెడతాను. నువ్వు ఇల్లంతా సర్ది, చక్కగా అలంకరించుకుని వచ్చి పక్కమీద పడుకుంటావు, నేను లైట్లార్పి వచ్చి...." గబుక్కున ఆయన నోరు మూసి ఇంట్లోకి లాక్కుపోయాను.

ఈ 'అమక్కళం' చూస్తున్న రాధ అంట్ల గిన్నెల ముందు శోకంగా కూలబడి 'తల్లీ, కరుమారియమ్మా! మా అమ్మగారికి త్వరలో మతిస్థిమితం చేకూర్చు తల్లీ నీకు పొంగల్ పెట్టుకుంటాను' అంటూ అరవంలో స్వగతం పలుకుతూ వుంది.



పక్కమీది దుప్పట్లూ అవీ దులుపుతున్నాను. ఇంతలో శ్రీవారు చీపురుకట్ట పట్టుకొచ్చి మంచం కిందదూరి దబదబా వుద్చేస్తున్నారు.

"అయ్యో రామా! ఇదేంపనండీ! చీపురు మగాళ్ళు ముట్టకూడదు అమంగళం. అబ్బ! బయటికి రండీ!" అంటూ ఆయన పైజామా పట్టుకులాగాను.

'వుండు డార్లిన్ మంచక్రింద బూజుంది!' అంటూ ఆయన కాలులోపలకి లాక్కున్నారు.

"అమక్కళం! కంట్రావి! కరుమారియమ్మా!!" అంటూ రాధ వచ్చి స్వగతం పలుకుతూ వుంది బుగ్గలు నొక్కుకుంటూ.

ఎలాగైనేం ఆయన్ని ఇద్దరం కలిసి మంచం కింది నించి బయటకిలాగి చీపురుకట్ట లాక్కున్నాం. ఆయన్ని కుర్చీలో కూలేసి చేతిలో హిండూ పేపర్ పెట్టి స్నానానికి వెళ్ళాను.

స్నానం చేసి వచ్చి చూసేసరికి ఆయనగారు స్టాండు మీది చీరలన్నీ మడిచి బీరువాలో పెడుతున్నారు. రాధ గుమ్మంలో నిలబడి విడ్డూరంగా చూస్తూంది.

"అయ్యో కర్మ! ఇదేంటండీ మళ్ళీ! చీరలన్నీ మడుస్తూ కూర్చున్నారూ. వేరే పనేంలేదామీకు? ఏవే రాధా మిర్రి గుడ్లేసుకు చోద్యం చూస్తున్నావు" అన్నాను. "లేదమ్మా! అయ్యా నన్ను ముట్టుకోవదన్నారు. అదేదో సౌతంత్రవటగా? చెరిసగం పనంటగా? మీరే చెప్పారటగా?" అంటూ సాగదీస్తూ దీర్ఘాలు తీస్తూ మూతి మూడు వంకర్లు తిప్పుకుంది. దాన్నెత్తిన ఒక మొట్టికాయ వేసి "పోయి నీళ్ళతోడు పో" అన్నాను. "అమక్కళం తాయే కరుమారియమ్మా!" అంటూ నిష్క్రమించింది స్వగతం పలుకుతూ.

"అదేవిటి డియర్ - దానికెందుకు మొట్టికాయ పెట్టావూ! ఇందులో తప్పేవుంది డార్లిన్! మరి నా బట్టలు నువ్వు సర్దిపెట్టడం లేదూ! చెరిసగం పని చేసుకోవాలిగా! ఇందా పట్టు ఈ బట్టలు కట్టుకో!" అంటూ ఓ నూలు చీర - జరీ బ్లవుజూ వుండచుట్టి చేతికిస్తున్నారు. నా మతి పోయిందా కాంబినినేషన్ చూచి.

"ఏం! నన్నే కట్టమంటావా? ఓ ఫష్టుగా షో కేసులో బొమ్మలా కడతా," అంటూ ఇస్త్రీ చీర విప్పదీసి కింద కుప్ప పోశారు.


"చాల్లే! ఇక్కడ్నించి కదలండి ముందు. ఆడంగిపనులూ మీరూనూ!" అంటూ ఆయన్ని బయటికి తోలి తలుపేసుకున్నాను.

డ్రెస్ చేసుకుని, ఆయనకో జత బట్టలు తీసిపెట్టి, బొట్టు పెట్టుకుంటూ ఆలోచిస్తున్నా - నాకు స్త్రీ సౌతంత్ర మొచ్చి అప్పుడే అరగంట పైనే అయింది. మరి పనులేమో చెరిసగం చేసుకోవాలన్నారు వనితా లోకంలో ఘనత వహించిన రచయిత్రులు. నా కెందుకో బాగా అనిపించలే. ఏమోలే వూరికే రాస్తారా? కారణం వుండకపోదు. సరే అని తీసిన ఆయన బట్టలూ అవీ వుండచుట్టి బీరువాలో కుక్కాను.

ఎంతసేపటికీ ఈ మనిషి నీళ్ళు పోసుకుని రాడేం చెప్మా! అని బాత్‌రూంలోకి తొంగిచూశా. లేరు. వంటింట్లో చూస్తే - అమక్కళం! ఆయన కింద మఠం వేసుక్కూర్చుని రాత్రి నానవేసిన పప్పు రోట్లో వేసి రుబ్బుతున్నారు. రాధ చెంబుతో నీళ్ళు చిలకరిస్తూ సాయం చేస్తూ వుంది.

"శ్రీహరీ! ఈ రోజు మీకేమొచ్చిందండీ! పాచి మొహమన్నా కడుక్కోకుండా పిండి రుబ్బుతున్నారూ! ఏవే రాధా తమాషా చూస్తూ కూర్చున్నావటే" అన్నావళ్ళుమండి.

"మీరు తినే పదార్థాలు నేనుదా ఎట్లా ముట్టుకునేది? మైల పడదూ! అందుకుదా అయ్యాకి సాయంచేస్తున్నా"నంటూ చెంబెడు నీళ్ళు రోట్లో గుమ్మరించి "కరుమారియమ్మా!" అంటూ స్వగతం పలుకుతూ తప్పుకుంది. ఆయన గార్ని పట్టుకు గుంజినా రుబ్బురోలు పట్టుకు వదిల్తేనా! వినాయకుడిలా మఠం వేసుక్కూర్చుని, మార్కండేయుడిలా రోలు కరుచుకు వుడిరా నంటారు మనిషి. "ఇహ లేవండి బాబూ, మీ వంతు రుబ్బడం అయిందిగా! ఇహ నేను దోశలు పోస్తా, వెళ్ళి నీళ్ళు పోసుకురండి" అన్నా బ్రతిమాలే ధోరణిలో నవ్వు, కోపం మిళితంకాగా.



'సరే త్వరగా కానీ టైమవుతూంద'ని స్నానానికి వెళ్ళారాయన.

టిఫెన్ అంతా రడీ చేసి పిల్చాను. ఇద్దరం కూర్చున్నాం. 'ఇదేంటిది? ఎప్పుడూ చెయ్యలేదులావుందీ! పత్రికలో నేర్చుకున్న కొత్త టిఫిను గాబోలు బాగు బాగు అన్నట్లు దీని పేరేంటి డియర్!" అంటూ స్పూన్‌తో పైకెత్తి క్రిందికి ఒలక బోస్తున్నారు.

"ఇది సూప్ కాదండీ! దోశలు - మీరేగా రుబ్బారు దోశలు తినండి" అన్నా ఒళ్ళుమండి.

"అవునుగదూ - కొంచెం డైల్యూటయింది గావును ఇఫ్ యు డోంట్ మైండ్, ఈ దోశలు గ్లాసులో పోసుకు తాగేసి వెళ్ళిపోతా" అంటూ

ఓ కప్పుడు ద్రవం గొంతులో పోసుకు తాగేసి 'వండ్రఫుల్' అంటూ ఆయన కాఫీ తాగి హాస్పిటల్‌కి బయలుదేరుతూ "మధ్యాహ్నం నువ్వు చెయ్యి-రాత్రికి నేను వంట చేస్తాలే టాటా" అంటూ కార్లో కూర్చున్నారు.

"టాటా....బైబై వంట చేస్తానని బజార్లోంచి అరవకండి" అంటూ వెళ్ళిపోతున్న కారు చూస్తూ గట్టిగా కేక పెట్టాను. తెలుగు తెలిసిన పక్కింటి శంభామామి కనుబొమలు పైకెత్తి అతిశయంగా చూచింది నావంక. నేను పళ్ళికిలించి లోపలకి జారుకున్నాను.

సాలోచనగా వచ్చి కుర్చీలో కూర్చున్నాను. టేబిల్ మీద పత్రికలు నన్ను వెక్కిరిస్తున్నాయి. ఘనత వహించిన రచయిత్రుల వ్యాసాలు, కథలు నవలలు అన్నీ గుర్తుకు వచ్చాయి. మొగవాడు స్త్రీని ఎలా బానిసనిచేసి ఆడిస్తున్నాడో చెబుతూ రాసిన వాళ్ళ రచనలు ఒక్కొక్కటి గుర్తుకు వచ్చాయి. మరి నా చిన్న సంసారంలో అలాటి తుఫానులేం కనబడలేదే? ఏమో! ఎన్ని కథలు, వ్యాసాలు చదవలేదు. మొగవాడు ఇలాగే నటించి, ఆఖరికి పెళ్ళాన్ని నట్టేట ముంచేస్తాడు. తడి గుడ్డలతో గొంతుకోస్తాడు. మొగవాడిని చెప్పు కింద తేల్లా పెట్టాలిగా మోసు అబ్బే! వృత్తినే నమ్మెయ్య కూడదు. అంతేగామరి ఒక్కొక్క కథలో ఎన్నెన్ని ఘోరాలు చేస్తున్నారీ మొగోళ్ళు సీరియల్సు చదవటంలే? 'కాటుక జారిన కన్నీటి కాలువ'లో అంతేగా అయింది ఆఖర్న. కనుక నాకు నచ్చినా, నచ్చకపోయినా ముందే కాస్త జాగ్రత్తపట్టం మంచిది. శ్రీవారిని కొంచెం క్రిందికి దించాలనిపించింది. సమాన హక్కులు నిరూపించుకోవాలి మరి. పత్రికలు మూసి లోపలి కెళ్ళాను ప్లాను ఆలోచిస్తూ.

మధ్యాహ్నం రెండున్నరకి లంచికి వచ్చారాయన స్టెతస్కోపు వూపుకుంటూ. "ఏం మేడమ్! నీ సమాన హక్కులు, స్త్రీ స్వాతంత్రం ఎలా ఎంజాయ్ చేస్తున్నావ్?" అంటున్నారు జాలీగా.


ఒక్కసారి ప్రసిద్ధ రచయిత్రీమణుల కథల్లో హీరోలను గుర్తుకు తెచ్చుకుంటూ ఒంట్లో పూనకం తెప్పించుకున్నాను. మూడ్ రాగానే "ఏం? అంత ఎకసెక్కెంగా వుందా నన్ను చూస్తే! ఛీ! మీ మగాళ్ళు స్త్రీని అర్థం చేసుకోలేరస్సలు బానిసల్ని చేస్తారు. మీపాటి తెలివి మాకూ వుంది. ద్రోహబుద్ధి కలవారు, కుళ్ళువారు, చెడ్డవారు, నవారు–"

ఆపైన ఇంకా డైలాగులు గుర్తురాలేదు. సీరియల్ ఇంకా పూర్తికాలేదుగా! ఏమనుకున్నారో ఏమో గభాల్ని జేబులోని థర్మామీటరు తీసి నా నోట్లో పెట్టి పల్సు చూడ్డం మొదలెట్టారాయన.

"ఏమండీ ఈ భాగోతం?" అన్నా కోపంగా.

నువ్వూరుకో "డెలీరియం, కోమా, సంధి ప్రేలాపన ఇప్పటిదాకా బాగానే వున్నావే పాపం?" అంటున్నారు నా మాట వినిపించుకోకుండా, స్టెత్ తగిలించుకుని నా గుండెల మీద పెడుతూ.

రాధ వచ్చింది. నా తల నిమిరి, బుగ్గలు పుణికి, గుడ్లనీరు కుక్కుకుంటూ "పాపం! పొద్దున్నుంచీ నేననుకుంటూనేవున్నా - అమ్మగారు ఎంతందంగా వుంటే ఏం లాభం ఎంతమంచిదైతే ఏం లాభం. పాపం! అయ్యో! అమాస్యా అర్ధరాత్రికి పొంగల్ పెట్టుకుంటానని మొక్కొండి, తిరువేర్కాడు కరుమారియమ్మ చాలా గొప్పది. నెలతిరక్కుండా



అమ్మగార్ని బాగుచేస్తుంది. అమ్మా తాయే! కరుమారియమ్మా!! కాప్పాడు" అంటూ నెత్తిన చెంగేసుకుని శోకాలు పాడుతూ కూర్చుంది.

నాకింకా ఎక్కువైంది. "ఛీ! నోర్మూయ్యండి ఇది సంధీకాదు, పూనకమూ కాదు. స్త్రీ స్వాతంత్ర సమర పోరాటం సమాన హక్కులు కావాలంటే వార పత్రికలు చదవండి స్త్రీల సెక్షన్ వ్యాసాలు చదవండి లేకపోతే మన రచయిత్రుల సీరియల్సు చదవండి – పోండి ముందిక్కడ్నించి" అంటూ రొప్పుతూ మంచం మీద పడ్డా కోపం, ఆయాసంతో వుడుక్కుంటూ.

రాధ, శ్రీవారు వచ్చి 'బాబ్బాబని' కాళ్ళూ చేతులూ పట్టుకుని ఇంత అన్నం తినిపించారు. కాస్త తృప్తి అనిపించింది. స్త్రీ లోకానికి కాస్త గౌరవాన్ని కల్గించాననిపించింది. ఆయన హాస్పటల్‌కి వెళ్తూ 'రాత్రి వంట నాది ఎర్లీగా వచ్చేస్తా ఎక్కడికి వెళ్ళకు' అంటూ వెళ్ళిపోయారు.

మధ్యాహ్నమంతా బోర్ కొట్టింది. ఏవిటో వెల్తిగా వుంది. సమాన హక్కుల పోరాటం అంతగా రుచించలేదు. ప్రొద్దున్నించి అనుభవిస్తున్న స్వతంత్రం సరిగా అర్థంకాలేదు. మరోసారి ఘనత వహించిన రచయిత్రుల్ని గుర్తుతెచ్చుకున్నా. వారాల తరబడి స్త్రీ పరపతి గురించి, అభ్యున్నతి గురించి ఛడామడా రాసుకున్న తర్జనభర్జనలన్నీ మననం చేసుకున్నా సారాంశం మాత్రం అందరూ చెప్పింది ఒక్కటే. మొగుణ్ణి నొక్కిపట్టాలి చనువివ్వకూడదు. వాళ్ళ ఆజ్ఞలు ధిక్కరించాలి. మొగాళ్ళు చేసే అరాచకాలన్నీ మనవూ చెయ్యాలి. మరి వాళ్ళు నోరెత్తకూడదు. అంతేగా! మరి వాళ్ళు తాగి, తందనాలాడి, చీట్లాడుకుంటారుగా మనవూ అలాగే చేస్తే మరివాళ్ళు నోరెత్తకూడదు. బావుంది. కాని సంసారంలో ఇద్దరూ ఇలా తయారైతే మరి కొంపకూలిపోదూ? ఛ! నాకేం అర్థం కావటం లేదు. ఈ రచనలు అర్థం చేసుకోడానికి నేను కనీసం విమెన్స్‌వెల్ ఫేర్ బోర్డు సెక్రెటరీని కాను, విమెన్స్‌లిబ్ డైరక్టర్‌నీకాను – కనీసం లేడీస్ క్లబ్బు ప్రెసిడెంటునీ కాను – ఆ గుర్తొచ్చింది. మావూరి లేడీస్ క్లబ్బులో నేనూ మెంబర్నే - ఆయనే చేర్పించారు - నన్నెక్కడికీ వెళ్ళొద్దన్నారుగా ఆయన, నేనెందుకు ఆయనకోసం వెయిట్ వెయ్యాలీ? నాకూ కోరికలుండవూ మరి? క్లబ్బులో సర్దాగా తిరగాలని వుండదూ. రాధకి చెప్పి లేడీస్ క్లబ్బుకి బయలుదేరాను. అందులో మెంబర్నేగాని ఎప్పుడూ వెళ్ళలేదు. నా తెలివితక్కువకి నొచ్చుకుంటూ ఇంతకాలం టైం వృధా చేశానని బాధపడుతూ లోపలి కెళ్ళాను. అందరూ నాకు క్రొత్తే. రెండు వర్గాలు కనబడ్డారు నాకు. ఒకటి మధ్య తరగతి పోచుకోలువర్గం. రెండోది అరిస్టోక్రేటిక్, సోఫిస్టికేటెడ్ - కాస్మాపాలిటన్ వర్గం. మొదటి గుంపులో కూర్చున్నా. వాళ్ళు వంటలూ వార్పులూ, చీరలూ నగలూ, స్త్రీ స్వాతంత్రం, ముప్పాళ రంగనాయకమ్మ కథలూ చెప్పుకుంటున్నారు. మొగాళ్ళ అరాచకాలు చెప్పుకుంటూ చీదరించుకుంటున్నారు. వూరుకోకుండా నేను కల్పించుకుని ఈ రోజు నా స్త్రీ సొతంత్రం గురించి చెప్పాను. అందరూ మెచ్చుకుంటారనుకున్నా. వాళ్ళ మొహాలు చూచాక మెల్లగా అక్కడ్నించి జారుకున్నాను. వెనకనించి వినబడింది. "ఎవరీ కొత్త మొహం వదినా! ఎంత బరితెగించిందీ! హవ్వ! గొప్ప ఘన


## పి. నాగప్రియంవదాదేవి



ఏ కళలో రాణించాలన్నా ఉత్సాహంతో పాటు తగిన ప్రోత్సాహమూ లభిస్తేనే, కళాకారులు వృద్ధిలోకి వస్తారు. పి. నాగప్రియంవదాదేవికి-పదమూడవ యేట నాట్యం పట్ల ఉత్సాహం ఏర్పడడం, తండ్రి, ప్రముఖ సినిమా నటులు పి. జె. శర్మ ప్రోత్సహించడంతో, ఆమె 'నరసాలయ' స్థాపకురాలు, ప్రముఖ నాట్య కళాకారిణి 'కళైమామణి' శ్రీమతి కె. జె. సరస వద్ద భరతనాట్యాన్ని అభ్యసించడం ఆరంభించింది. ఆమె రంగప్రవేశం చిదంబరంలోని సభానాయికర్ ఆలయంలో జరిగింది. ఆ తర్వాత ఆమె వివిధ ప్రాంతాలలో నాట్యప్రదర్శనలు యిచ్చి పెద్దల ఆదరాభిమానాలను చూరగొనడమే కాక కళాశాల నిర్వహించిన పోటీలో పాల్గొని ఉత్తమ నర్తకిగా బహుమతి గెల్చుకుంది. ఇటీవలే—డా॥ పద్మాసుబ్రహ్మణ్యం రూపొందించిన నృత్య నాటిక 'వల్లీ కల్యాణం'లో నాగప్రియంవదాదేవి నారద పాత్ర ధరించి, నాట్యాభిమానుల ప్రశంసలు పొందింది.

కార్యం చేసిందిలే'' అని ఎగతాళిగా నవ్వుకుంటున్నారు. ఇహ రెండో వర్గం వాళ్ళకి నాటాపిక్ చాలా పాతదట. వాళ్ళు అప్పుడప్పుడూ ఇళ్ళ కెళుతుంటారట. నేను చాలా లోలెవలట. ఇంకా పనిదాన్నట వాళ్ళకు స్త్రీ స్వాతంత్రం, సమాన హక్కులు — ఇదొక పాత చింతకాయ పచ్చడి. 'పురుష స్వాతంత్ర్యం కనీస హక్కులు' అంటూ వాళ్ళ మొగుళ్ళు లబలబమంటుంటారట. పీడిత స్త్రీజన అభ్యున్నతికోసం పాటుపడే ఈ మేళం వదిలించుకుని ఇంటికి చేరాను ఆలస్యంగా. ఆయన వచ్చి, నే లేకపోవడం చూసి బాగా విసుక్కోవాలి. పెళ్ళాం విలువ అప్పుడు గాని తెలిసి రాదు. అర్జంటు కేసూ, ఇంపార్టెంటు కేసూ అంటూ ఆలస్యంగా వస్తే నేను పడిగాపులు పడటం లేదూ! అంతేకావాలి! గుమ్మంలో రాధ ఎదురుపడి చెప్పింది. అయ్య వచ్చి తను క్లబ్బు కెళ్ళినట్లు తెలుసుకుని, రాధ చేత టిఫిన్ పెట్టించుకు తినేశారట. ఆరు దాకా చూచి, 'నిండా కవలై పడి', అన్నామలై మండ్రంలో వైజయంతి మాల డాన్సు బెనిఫిట్ షో చూచేందుకు వెళ్ళారట. తను వస్తే అక్కడికే రమ్మని ఒక డోనార్ టికెట్టు రాధకిచ్చి వెళ్ళారు. నా స్త్రీ సౌతంత్రం ప్లాటు పట్టీ కొట్టింది. మంచి ప్రోగాం కాస్తా పోయింది. ఆయన పాటి కాయన చెయి జారిపోయారు. తిక్కకుదరాలంటే వంట చెయ్యకూడదు. అర్థరాత్రి ఆయన చేత వండించనూ ఏమనుకుంటున్నాడో మనిషి? 'స్త్రీ సౌతంత్రం, సమానహక్కులు వనితాలోకం' అనుకుంటూ ఇన్స్పిరేషన్ తెప్పించుకున్నాను.

ఏ అర్థరాత్రికో వస్తారనుకున్న ఆయన ఎనిమిదింటి కంతా వచ్చేశారు. నన్ను చూచి, ''డియర్ నువ్వూ వస్తావనుకున్నా. రాలేదేం? ఒంటరిగా కూర్చుని చూస్తూన్న నాకు అంతటి వైజయంతి మాల డాన్సు చప్పగా అనిపించింది. అందుకే వచ్చేశా'' అంటూ వంటింట్లోకి నడిచారు. ''అన్నట్లు ఈ పూట వంట నేను చేయ్యాలికదూ! అందుకే ఆలస్యమవుతే నీవుండ లేవని త్వరగా వచ్చేశా'' అన్నారు. పొయి ముట్టించకుండా అర్థ గిన్నెడు బియ్యంలో అరగ్లాసుడు నీళ్ళు పోస్తూ. ''నాకివాళేం బాగోలేదు. అలా బీచికెళ్ళి బుహారీలో ఏదన్నా తీసుకుందాం రండి'' అన్నా. 'ఓకే' అంటూ కారెక్కారాయన.



నాకు హక్కుల విషయంలో ఇంకేమీ తోచలేదు. అలా ప్రెసిడెన్సి కాలేజి టవర్ చూస్తుంటే మంచి ఐడియా తట్టింది.... భలే! దెబ్బతో అయ్యగారు తోక ముడుస్తారు. నా స్త్రీ సౌతంత్రాన్ని పటిష్ఠం చేసుకోవచ్చు. నా సమాన హక్కుల్ని నిరూపించు కుంటాను. ఆయన్ని ఇరకాటంలో పెట్టి చూడాలి.

''ఏమండీ! నేను ఎం. బి. బి. యస్ కంప్లీటు చేస్తాను. మళ్ళీ చదివిస్తారా?'' అన్నాను.

ఆయన నోరు తెరిచి ఒక్క పట్టీ కొట్టి, ''నిఝంగానా? అబ్బ! ఎంత కాలానికి దేవుడు నీకి మంచి బుద్ధి పుట్టించాడు. రేపే ఎమ్. ఎమ్. సి నించి. అప్లికేషన్ ఫారాలు తెస్తాను. డీన్ తో మాట్లాడి వస్తాను. నువ్వు తప్పకుండా చదవాలి.'' అన్నారు అప్యాయంగా నా చెయ్యి పట్టుకుని.

ఇక్కడా మరి నా స్త్రీ సౌతంత్ర సమర పోరాటం జరగలేదు. నిజంగా మళ్ళీ చదవాలేమో ఖర్మ. భయం వేసింది. ''లేదండీ! వూరికే అలా అన్నా. నాకంత ఓపికేది. ఏమండి పొద్దుపోయింది ఇంటికి పోదాం'' అంటూ లేచా.

మంచం మీద పడుకున్నానే గాని నాకు పత్రికలు, స్త్రీల వ్యాసాలూ ఇంకా మనసులో తిరుగుతూనే వున్నాయి. అవి రాసేవాళ్ళంతా సమానహక్కు స్త్రీ స్వాతంత్ర్యం, వున్నవాళ్ళే గదూ. లేకుంటే వాళ్ళ శ్రీవార్లు చావగొట్టి చెవులు మూస్తారు. కొందరికి వ్యాసరచన ఒక హాబీ! చెప్పే సూక్తులన్నీ అనుభవించి, ఆచరించి రాసేందుకు వాళ్ళు గాంధీమహాత్ములేం కాదు. తాము ప్రబోధించింది ఆచరించేందుకు అందరూ దేవుని బిడ్డ ఏసు ప్రభువులూ కాలేరు. రాయడం వేరు ఆచరించడం వేరు. ముఖ్యంగా ఆడవారికి.

చదివే వాళ్ళందరూ స్త్రీ సౌతంత్రం, సమాన హక్కులంటూ నాలాగే పాటుపడితే?? — అమ్మో! సంసారాలేగతికాను. భయంవేసి ఆయన మీద చేయివేసాను, మరేం చెయ్యాలి? వాళ్ళు రాసిన దాంట్లో తప్పులు పడుతూ దెప్పుతూ తిరిగి అదే సంగతి రాయాలి. మళ్ళీ వాళ్ళు రాస్తారు. మళ్ళీ నేను రాస్తాను. మళ్ళీ మళ్ళీ .. ఛ! బోర్‌గా వుంది. ఈ సమస్యలు, సమానహక్కులు నా బుర్రకెక్కడం లేదు. టీ పాయ్ మీద సమానహక్కుల వ్యాసం ఫాన్ గాలికి రెప రెపలాడుతోంది! □